సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 7 । జనవరి । 2024



సర్కారు బడి.. సరికొత్త ఒరవడి

ప్రభుత్వం మనబడి నాడు– నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఇందుకోసం భారీగా నిధులు వెచ్చించింది. -8లో



ఎర్రచందనం దుంగల స్వాధీనం

పీలేరులో వాహనంతోపాటు రూ.16 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 118 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	192	192
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 20.500 కిలోలు

న్యూస్‌రీల్

నేడు సమావేశం

రాయచోటి: రాయచోటిలో ఆదివారం వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ జిల్లా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు వీసీ రెడ్డప్పరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి పట్టణం చిత్తూరు రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న పీడీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ నాయకులు, న్యాయవాదులు పాల్గొంటారని వారు తెలిపారు.

నేడు జిల్లాస్థాయి చెకుముకి సైన్స్‌సంబరాలు

రాయచోటి అర్బన్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు రాయచోటి పట్టణంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. డైట్‌లో ఈ సంబరాలను ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 30 మండలాల నుంచి 60 జట్లు పాల్గొంటాయన్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన 180 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

జాతీయస్థాయి ఖోఖోలో సత్తా

ఎర్రగుంట్ల: డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో ఉన్న డీఏవీ స్కూల్ విద్యార్థులు ఖోఖో క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారని ప్రిన్సిపల్ శ్రీనివాస గుప్తా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతు ఈ నెల 3,4,5 తేదీల్లో హర్యానా రాష్ట్రంలోని గురుగ్రామ్‌లో జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నాని రాణించారన్నారు.విద్యార్థులు, వ్యాయా ఆర్టీపీపీ సీఈ నాగరాజు, డీఏవీ ఆర్‌ఓ శేషాద్రి ప్రత్యేకంగా అభినందించారన్నారు. విద్యార్థుల గెలుపుకు ప్రధాన కారుకుడైన వ్యాయామ ఉపాధ్యాయుడు నరేషను ప్రత్యేకంగా అభినందించారు.

పరుగుపందెంలో ప్రతిభ



బంగారు పతకాన్ని చూపుతున్న హరిణి

పులివెందుల టౌన్: అనంతపురంలోని ప్రభుత్వ పాల్‌టెక్నిక్‌లో ఇంటర్ పాల్ టెక్నిక్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఇందులో పులివెందుల లయోలా పాల్‌టెక్నిక్(వైఎస్ఆర్ఆర్) కళాశాలకు చెందిన హరిణి 100మీటర్ల పరుగు పందెంలో రాణించింది.బంగారు పతకం సాధించింది. తొండూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన హరిణి కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.విద్యార్థినికి కళాశాల ప్రిన్సిపల్ బ్రిట్టో, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కడప గడపలో క్రికెట్ సందడి



వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా క్రికెట్ సంబరానికి రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిష్టాత్మకంగా భావించే కల్నల్ సీకే నాయుడు అండర్–23 బీసీసీఐ అంతర్ రాష్ట్రాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు కడప గడపలో నిర్వహించనున్నారు. ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రా జట్టు గోవా జట్టుతో తలపడనుంది. రెండో మ్యాచ్ ఆంధ్రా, చత్తీస్‌ఘర్ జట్ల మధ్య ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మూడో మ్యాచ్ ఫిబ్రవరి 18 నుంచి 21వ తేదీ వరకు ఆంధ్ర, రైల్వేస్ జట్ల మధ్య నిర్వహించనున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ సంయుక్త సహకారంతో మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఏవైడీ అధ్యక్ష,కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, ఎ. రెడ్డిప్రసాద్ తెలిపారు.

భరోసా.. భద్రత

- ఈ–శ్రమ్ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు
- అసంఘటితరంగ కార్మికులకు గుర్తింపు
- క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఈ–శ్రమ్ పథకం శ్రామిక జనావళికి ఆసరాగా నిలుస్తోంది. చిరు, వీధి వ్యాపారులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ఈ పథకం రూపుదిద్దుకుంటోంది. క్షేత్రస్థాయిలోని కార్మికుల వివరాలను నమోదు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ విశేష కృషి చేస్తోంది. ఆధార్‌కార్డు తరహాలో దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రయోజనం చేకూరేలా యూనివర్సల్ అకౌంటు నంబరుతో కూడిన ఈ–శ్రమ్ గుర్తింపు కార్డును అందుకునేందుకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అనధికారికంగా దాదాపు ఆరు లక్షల మందికి పైగా అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. వలస, అసంఘటిత రంగ, చిరు వ్యాపారులకు స్థానికత, సంఘటిత పరిస్థితులు ఉండవు. వీరికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

ఇవీ ప్రయోజనాలు

కార్మికులకు గుర్తింపు కార్డును జారీ చేస్తారు. దీంతో కార్మిక కుటుంబానికి సామాజిక భద్రత కలుగుతుంది. కార్డు కలిగిన వారికి రూ. 2 లక్షల ప్రమాద బీమా, పనిలో ఉండగా అంగవైకల్యం కలిగితే రూ. లక్ష ఆర్థికసాయం అందిస్తారు. విపత్తుల కాలంలో శ్రామికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటారు. వృత్తి నైపుణాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ కార్డు ఎంతో ఉపకరిస్తుంది. అసంఘటితరంగ కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు నమోదు అవసరం. అలాగే ఆర్థికసాయం నేరుగా లబ్ధిదారుని ఖాతాకు జమ చేసే వీలుంటుంది.

అర్హులు వీరే!



18–59 సంవత్సరాల నిర్మాణ వలస కార్మికులు, ఇంటిపనివారు, వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు,పశు పోషకులు, తోలు, వండ్రింగి, ఉప్పు, ఇటుక బట్టీల కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో రిక్షా కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, షాపుల్లో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేనివారు ఈ పథకానికి అర్హులు.

నమోదు ఎలా చేయాలంటే..

కార్మికుడు ఈ–పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగా వివరాలు నమోదు చేసి యూనివర్సల్ అకౌంటు నంబరు గుర్తింపు కార్డును జారీచేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లలో నమోదు చేసుకోవచ్చు.కార్మికుని ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంటు వివరాలు చెప్పాల్సి ఉంటుంది. కార్మికుడు ఎవరి వద్ద పనిచేస్తున్నాడో వెల్లడించాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నారో చెబితే సరిపోతుంది. పథకంలో ఒకసారి నమోదైతే చాలు...మళ్లీ రెన్యూవల్ చేయాల్సిన అవసరం లేదు. ఆ వివరాలు శాశ్వతంగా వెబ్‌సైట్‌లో ఉంటాయి.

వివరాలు నమోదు చేసుకోవాలి



జిల్లాలోని భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు ఈ–శ్రమ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ విషయంగా కార్మికులకు ఇప్పటికే తెలియజేశాం. ప్రతి ఒక్క కార్మికుడు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. – డి.డేనియల్, అధ్యక్షులు, భవన నిర్మాణ కార్మిక సంఘం, కడప

నిరంతర ప్రక్రియ



ఈ–శ్రమ్ నమోదు అనేది సంబంధిత కార్యాలయాల్లో నిరంతరంగా నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా కార్మికులు ఎవరైనా తమ వివరాలు నమోదు చేసుకోకుంటే సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి.
– బి.శ్రీకాంత్‌నాయక్, కార్మికశాఖ అధికారి, కడప

సంక్రాంతికి స్పెషల్ బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ వ్యాప్తంగా అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల నుంచి 797 స్పెషల్ సర్వీసులను నడపనున్నామని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. జోన్ వ్యాప్తంగా హైదరాబాద్ 286, బెంగళూరు 268, చెన్నై 43, విజయవాడ 72, ఇతర నగరాలకు 128 సర్వీసులు చొప్పున మొత్తం 797 బస్సులు నడపనున్నామని వివరించారు. ఈ బస్సులను ఈనెల 10వ తేదీ నుంచి నడపనున్నట్లు తెలియజేశారు.

- అనంతపురం నుంచి హైదరాబాద్‌కు 37, బెంగళూరుకు 37, చెన్నై 7, విజయవాడ 10, ఇతర నగరాలకు 11 బస్సులు చొప్పున మొత్తం 102 బస్సులను నడపనున్నారు.
- అన్నమయ్య జిల్లా నుంచి హైదరాబాద్‌కు 5, బెంగళూరు 17, విజయవాడ 6 కలిపి మొత్తం 30 సర్వీసులు నడవనున్నారు.
- చిత్తూరు జిల్లా నుంచి హైదరాబాద్‌కు 1, బెంగళూరు 57, విజయవాడ 2, ఇతర నగరాలకు 13 సర్వీసులు చొప్పున మొత్తం 73 బస్సులు నడుస్తాయి.
- కర్నూలు జిల్లా నుంచి హైదరాబాద్‌కు 48, బెంగళూరు 25, చెన్నై 2, విజయవాడ 11, ఇతర జిల్లాలకు 6 చొప్పున మొత్తం 92 సర్వీసులు నడుస్తాయి.
- నంద్యాల జిల్లా నుంచి హైదరాబాద్‌కు 67, బెంగళూరు 03 కలిపి మొత్తం 70 సర్వీసులు నడుస్తాయి.
- సత్యసాయి జిల్లా నుంచి హైదరాబాద్ 25, బెంగళూరు 19, చెన్నై 5, విజయవాడ 7, ఇతర నగరాలకు 14 చొప్పున మొత్తం 70 సర్వీసులు నడపనున్నారు.
- తిరుపతి జిల్లా నుంచి హైదరాబాద్‌కు 15, బెంగుళూరు 40, చెన్నై 17, విజయవాడ 11, ఇతర నగరాలకు 59 కలిపి మొత్తం 142 సర్వీసులు నడుస్తాయి.
- వైఎస్సార్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు 88, బెంగుళూరు 70, చెన్నై 10, విజయవాడ 25, ఇతర నగరాలకు 25 కలిపి మొత్తం 218 సర్వీసులు నడపనున్నారు.

ఓటమే గెలుపునకు నాంది

ముగిసిన బాలోత్సవ్



విద్యార్థికి బహుమతి ఇస్తున్న కమిటీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్: ఓటమే గెలుపునకు నాంది అని, ఎవరు కూడా ఓటమికి కుంగిపోకుండా ముందుకు సాగాలని వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో నిర్వహిస్తున్న కడప బాలోత్సవ కార్యక్రమం శనివారం ముగిసింది. బాలోత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీరాజా, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ధాజశేఖర్ రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నేటి యువకులు ఆధునిక సాంకేతిక పేరుతో సెల్‌ఫోన్లకు బానిసలు అతున్నారన్నారు. పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచుతూ వారిలోని సృజన్మాతకను, గుర్తించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం 42 రకాల యాక్టివిటీస్‌లో పాల్గొని విజయం సాధించిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ నాగమునిరెడ్డి, కమిటీ సభ్యులు బాలఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- రాయచోటిలో 100 పడకల ఆసుపత్రి ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న జిల్లాకలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జకియాఖానం తదితరులు

రాయచోటి టౌన్: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జకియాఖానం పేర్కొన్నారు. రాయచోటిలో రూ.24.5 కోట్లతో నిర్మితమైన 100 పడకల ఆస్పత్రిని శనివారం వారు ప్రారంభించారు. జ్యోతిప్రజ్వలన చేసి ఆస్పత్రిలోని వార్డుల్లో కలియతిరిగి రోగులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వీరు మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించి కార్పొరేట్ స్థాయిలో పేదవాడికి వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.

ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించింది: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి నియోజక వర్గ ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించిందని, 100 పడకల ఆస్పత్రి నిర్మితమైందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈవిషయం గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎంతో సహకరించారని, అడిగిన వెంటనే ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతోపాటు వెంటనే నిధులు కూడా మంజూరు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు తెలిపారు. ఈ నూతన ఆస్పత్రి అధునాతన సౌకర్యాలతో నిర్మితమైనట్లు చెప్పారు. అన్ని రకాల పరీక్షలు ఇక్కడే చేస్తారని, అందుకు తగినట్లుగా వైద్యులు సేవలు అందిస్తారన్నారు. విద్య, వైద్యం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధిక మొత్తంలో ఖర్చుచేస్తున్నారని తెలిపారు. పెద్ద జబ్బులకు ఇతరప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే మెరుగైన వైద్యం పొందే విధంగా ఆస్పత్రి నిర్మితమైందన్నారు. మూడు అధునాతమైన ఆపరేషన్ థియేటర్లు, 10 ఐసీయూ పడకలతో (పెద్దు), అనస్థీషియా, ఈఎన్‌టీ విభాగం కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు.

అందరి ఆరోగ్యమే సీఎం ధ్యేయం: ఎమ్మెల్సీ జకియాఖానం

రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం అన్నారు. రాయచోటిలో 100 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీఎం ఆకాంక్ష మేరకు రోగులకు నాణ్యమైన వైద్యం అందించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ సభ్యుడు, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారీ మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్,డాక్టర్ బయారెడ్డి, డాక్టర్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసరెడ్డి, నాయకులు మదనమోహన్‌రెడ్డి, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, ఫయాజ్ అహమ్మద్, ఆసిఫ్ అలీఖాన్, జాకీర్ రౌనక్, గౌస్‌ఖాన్, అన్నా సలీం, సాధిక్ అలీ, షబ్బీర్, ఎస్‌పీఎస్, గువ్వల లక్ష్మీదేవి, బుజ్జిబాబు, విజయభాస్కర్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్, కో ఆప్షన్ సభ్యులు అయ్యవారరెడ్డి, పీవీఆర్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన పీవీ రమణ, కార్తీక్, డాక్టర్ మహేశ్వరరాజు, డాక్టర్ లక్ష్మిప్రసాద్, డాక్టర్ కిరణ్, డాక్టర్ ఖదీర్‌బాషా పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి



రాయచోటి: 1800 మెగా వాట్ వీరబల్లి ఆఫ్–స్ట్రీమ్ క్లోజ్డ్ పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూసేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు వీరబల్లి మండలంలో 616.56 ఎకరాలు, రామాపురం మండలంలో 59.35 సెంట్లు అవసరమవుతాయని, ప్రతిపాదిత ప్రాజెక్టు అధికారులు గుర్తించినట్లు చెప్పారు. ప్రాజెక్టు భూముల నిమిత్తం ఇప్పటికే ఫారం ఏ2, ఫారం –సీలలో అనుమతులు మంజూరు అయ్యాయన్నారు. ప్రాజెక్టు నిమిత్తం సేకరిస్తున్న భూములకు చట్టపరిధిలో న్యాయమైన ధరను చెల్లించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో రాజంపేట, రాయచోటి ఆర్డీఓలు రామకృష్ణారెడ్డి, రంగస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ప్రసన్నకుమార్, ఆర్‌అండ్‌బి డీఈ సహదేవరెడ్డి, ఉద్యానశాఖ అధికారి రవింద్రబాబు, ఫారెస్టు అధికారులు, సంబంధిత తహశీల్దార్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు కల్చరల్: కేసీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసీపీ పుల్లయ్య జ్ఞాపకార్థం ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉపకారవేతనాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కె.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువు తున్న 500 మందికి ఉపకార వేతనాలకు అందించనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం 80శాతం పైగా మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. ఫిబ్రవరి 29లోగా కేసీ పుల్లయ్య ఫౌండేషన్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకో వాలన్నారు. వివరాలకు 9949516637, 08564– 253866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గుర్రంకొండలో ఛత్తీస్‌గఢ్ ప్రేమజంట


పోలీసుల అదుపులో ఛత్తీస్‌గఢ్ ప్రేమజంట

గుర్రంకొండ : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ ప్రేమ జంటను అన్నమయ్య జిల్లా గుర్రంకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గి జిల్లా మల్‌పూరి గ్రామానికి చెందిన లోకేశ్వర్ బంజారా(22) కార్పెంటర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పక్కనే ఉన్న మాడ్‌బార్ గ్రామంలోని ఓ ఇంట్లో.. కార్పెంటర్ పని చేయడానికి కొన్ని రోజులు వెళ్లాడు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కుమారి దిబ్యాన్నేసాహూ(16) అనే బాలికతో స్నేహం కుదిరింది. ఇద్దరి మధ్య ప్రేమ కలిగి 2023 జూలై 29న ఇంట్లో నుంచి పారిపోయారు. కొద్ది రోజులు ఒరిస్సా రాష్ట్రంలో ఉన్నారు. నెల రోజుల క్రితం అన్నమయ్య జిల్లా తరిగొండ గ్రామానికి సమీపంలోని ఓ డ్రాగన్ ఫ్రూట్ తోట వద్ద పని చేసే వరుసకు లకేశ్వర్ బంజారాకు బాబాయి అయిన వ్యక్తి వద్దకు చేరుకొన్నారు. తమకు పెళ్లి జరిగిందని నమ్మించి ఇక్కడే పని చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. అప్పట్లో తమ కుమార్తె కనిపించడం లేదని దిబ్యాన్నే సాహూ తల్లి దుర్గి జిల్లాలోని ఛవన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వరుణ్‌దేవతా, ఏఎస్‌ఐ బేనిసింగ్ రాజపుత్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం కేసును దర్యాప్తు చేసుకొంటూ గుర్రంకొండకు చేరుకొన్నారు. శనివారం స్థానిక ఎస్‌ఐ దిలీఫ్‌కుమార్‌తో కలిసి తరిగొండ డ్రాగన్‌ఫ్రూట్ తోట వద్దకు వెళ్లి ప్రేమజంటను అదుపులోకి తీసుకొన్నారు. వారిని పోలీసులు ఛత్తీస్‌గఢ్ తీసుకెళ్లారు. అక్కడి పోలీసులు అన్నమయ్య జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

10 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మదనపల్లె : పది మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లె వద్ద ఓ స్థలం విషయమై ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో అరుంధతీవాడకు చెందిన భద్రప్ప కుమారుడు తలారిభానుప్రసాద్ మరో వ్యక్తితో కలిసి శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంలో వెళుతుండగా, అదే గ్రామానికి చెందిన పది మంది వ్యక్తులు వారిపై దాడికి పాల్పడి కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ శేఖర్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బాధితుడు భానుప్రసాద్ ఫిర్యాదు మేరకు చిలకవారిపల్లెకు చెందిన సుధాకర, శేఖర్, విద్యాసాగర్, రెడ్డిశేఖర్, వినోద్, శ్రీనివాసులు, చలపతి, చిన్నరాము, శివ, తోపురామన్నపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


దీపిక మృతదేహం

మదనపల్లె : వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో జరిగింది. చంద్రాకాలనీకి చెందిన వెంకటరమణ భార్య దీపిక(24) ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త వెంకటరమణ పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోళ్లబైలు పంచాయతీ జంగాలపల్లెకు చెందిన కృష్ణప్ప, లక్ష్మీదేవమ్మ కుమారుడు వెంకటరమణ, కర్ణాటక మద్దగిరికి చెందిన నాగప్ప, నాగమ్మ కుమార్తె దీపిక ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారు పట్టణంలోని చంద్రా కాలనీలో నివసిస్తున్నారు. వెంకటరమణ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుండగా, దీపిక గార్మెంట్స్‌లో పని చేస్తుండేది. ఆరునెలల క్రితం వ్యక్తిగత కారణాలతో గార్మెంట్ పనులు నిలిపివేసి ఇంటి పట్టునే ఉంటోంది. ఇంటి పట్టునే ఒంటరిగా ఉంటున్న దీపిక ఒంటరితనాన్ని భరించలేకపోతున్నానంటూ భర్తతో పలుమార్లు చెప్పింది. అలాంటి ఆలోచనలు మానుకోవాలంటూ వెంకటరమణ భార్యకు నచ్చజెప్పాడు. ఈ క్రమంలో శనివారం వెంకటరమణ యథావిధిగా పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చాడు. ఇంటిలోకి వెళ్లగానే, భార్య దీపిక చున్నీతో ఉరివేసుకుని వేలాడుతుండటాన్ని గమనించాడు. వెంటనే ఆమెను కిందకు దించి హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి ఆటోలో తరలించాడు. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో అవుట్‌పోస్ట్ పోలీసులు టూటౌన్ స్టేషన్‌కు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. వెంకటరమణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఆటో, వ్యాన్ ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడిన లక్ష్మీదేవి

గుర్రంకొండ : గుర్రంకొండ పంచాయతీ గాజులవారిపల్లె క్రాస్ వద్ద శనివారం ఆటో, వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన ఎస్.నరసింహులు(65), ఎస్.లక్ష్మీదేవి శనివారం మండలంలోని చెర్లోపల్లెకు చెందిన తమ బంధువుల ఇంటికి ఆటోలో వచ్చారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి ఆటోలో మదనపల్లెకు బయలుదేరారు. మార్గంమధ్యలో మదనపల్లె నుంచి గుర్రంకొండకు వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ సంఘటనలో నరసింహులు, లక్ష్మీదేవికి గాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి, స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన లక్ష్మన్న కుమారుడు భాస్కర(33) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో వాల్మీకిపురానికి వెళ్లి తిరిగి వస్తుండగా, మార్గంమధ్యలోని కాశీరావుపేట వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును తప్పించబోయి, అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదే విధంగా మదనపల్లె మండలం చిప్పిలికి చెందిన హరి భార్య జి.నాగరేఖ(30) ద్విచక్రవాహనంలో పట్టణంలోకి వచ్చి తిరిగి గ్రామానికి వెళుతుండగా, నక్కలదిన్నె వద్ద ఆమె ద్విచక్రవాహనాన్ని కారు వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన నరసింహులు(50) తన బంధువైన లక్ష్మీదేవి(65)తో కలిసి ద్విచక్రవాహనంలో గుర్రంకొండకు వెళుతుండగా, మార్గంమధ్యలోని రెడ్డికోట వద్ద ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. ఆయా ఘటనల్లో బాధితులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతకొమ్మదిన్నె : చెన్నూరు నుంచి కర్ణాటకకు తరలిస్తున్న 300 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శనివారం పట్టుకున్నారు. బుగ్గ అగ్రహారం సమీపంలో ఐచర్ వాహనంలో తరలిస్తుండగా విజిలెన్స్ సీఐ హిందూ బాషా, ఏవో బాలగంగాధర్‌రెడ్డి, సిబ్బంది అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. వాహనంతోపాటు బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీరబ్రహ్మయ్య, హరికృష్ణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

సర్కారు బడి.. సరికొత్త ఒరవడి

ముళ్లకంపల దారి.. శిథిలావస్థ గదులు.. పెచ్చులూడుతున్న పై కప్పు.. తలుపులు లేని మరుగుదొడ్లు.. తాగునీటి కొరత.. తరగతి గదిలో కిందనే కూర్చోవాల్సి ఉండటం తదితర అసౌకర్యాలు.. నాడు ప్రభుత్వ పాఠశాలల్లో దర్శనమిచ్చేవి. దీంతో విద్యార్థుల సంఖ్య నానాటికీ దిగజారిపోయేది. కానీ నేడు పరిస్థితి మారిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు– నేడు కార్యక్రమం ద్వారా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఇందుకోసం భారీగా నిధులు వెచ్చించింది. కార్పొరేట్ స్కూళ్లను మించి వసతులను కల్పించింది.. భారీ భవంతులు.. పటిష్ట తరగతి గదులు.. రక్షణగోడ, ముఖద్వారం.. ఆకర్షిస్తున్న రంగులు.. విజ్ఞానం పెంచే చిత్రాలు.. అధునాతన బెంచీలు.. సౌకర్యాల మరుగుదొడ్లు.. ఆహ్లాదకర ప్రాంగణం.. ఆటస్థలం.. శుద్ధినీరు... ఇలా ఎన్నో సౌకర్యాలతో అలరారుతున్నాయి. దీంతో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల వైపు అడుగులు వేస్తున్నారు. – సాక్షి, నెట్‌వర్క్

నాడు | నేడు



మదనపల్లె : రామారావు కాలనీ బాపూజీ మున్సిపల్ హైస్కూల్



రాజంపేట టౌన్ : కూచివారిపల్లె పంచాయతీ డీజీఎన్‌పల్లె ప్రాథమిక పాఠశాల తరగతి గది




సిద్దవటం : భాకరాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



వాల్మీకిపురం : కోనేటివీధిలోని ఎంపీపీ మెయిన్ స్కూల్



పీలేరు : కోటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల

ఎర్రచందనం దుంగల స్వాధీనం


పీలేరు : పట్టుకున్న కారు, ఎర్రచందనం దుంగలతో ఫారెస్ట్ అధికారులు

పీలేరు : వాహనంతోపాటు రూ.16 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి తెలిపారు. వివరాలిలా వున్నాయి. శనివారం తెల్లవారుజామున పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డు మార్గంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీలేరు వైపు నుంచి వచ్చిన కారును అటవీ సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. దీంతో డ్రైవర్ వేగంగా ముందుకు వెళ్లి వాహనాన్ని రోడ్డుపక్కన ఆపి పరారయ్యాడు. వాహనాన్ని తనిఖీ చేయగా 370 కేజీల బరువు గల 10 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతోపాటు దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో ఎస్.వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, ప్రభుతేజ, డి.చరణ్, మల్లికార్జున, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

స్మగ్లర్ అరెస్టు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పరిధిలోని గుండాల బీటువద్ద ఎర్రచందనాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి ఎనిమిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి తెలిపారు. నిందితుడు ఏలుమల్లయ్యగా గుర్తించినట్లు పేర్కొన్నారు. దుంగలు 152 కేజీలు ఉన్నాయని, నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు వివరించారు.

మడకశిర ఎంఈఓ అరెస్ట్

– ఉద్యోగాల పేరుతో మోసం కేసులో..


నిందితుడు శ్రీనివాసులు

తంబళ్లపల్లె : ఉద్యోగాల పేరుతో మోసం చేసిన కేసులో శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండల విద్యాశాఖ అధికారి మేనాటి శ్రీనివాసులు భాస్కర్ (49)ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎంఈవో, మరో ఇద్దరు కలిసి సచివాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేశారు. ఆ మేరకు బోగస్ అపాయింట్‌మెంట్ లెటర్లను ఇచ్చారు. వాటిని తీసుకున్న వారు సంబంధిత ప్రాంతాల్లోని కార్యాలయాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే కొందరు 2021లో తంబళ్లపల్లె ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. వాటిని బోగస్ లెటర్లుగా నిర్ధారించిన అధికారి మడకశిర ఎంఈవో ఎం.ఎస్.భాస్కర్ సహా మరో ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఎంఈవోను అరెస్ట్ చేసిన పోలీసులు స్థానిక వైద్యశాలలో ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు పర్చగా న్యాయస్థానం రిమాండ్‌కు ఆదేశించింది.

జూదరుల అరెస్ట్

మదనపల్లె : జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె సమీపంలోని కాట్లాటపల్లె రోడ్డులో కొందరు వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఎం.ఎల్.శివకుమార్(32), బంగారు నాగార్జున(41), ఎం.రమణ(42) అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1,920 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడిలో సిబ్బంది వెంకటేష్, చక్రి, శంకర తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 8 మందికి గాయాలు

మదనపల్లె : కుక్కల దాడిలో 8 మంది గాయపడిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. బాపూజీ పార్కు ఎదురువీధిలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. కుక్కల దాడిలో 8 మంది గాయపడగా, వారు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (48) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగంపేట జాతీయ రహదారిలోని హ్యాపీడేస్ డాబా హోటల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మృతుడి తల పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో వ్యక్తిని గుర్తు పట్టలేకపోతున్నామన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అద్దె ఇంటి బాధ తప్పింది



జగనన్న మంజూరు చేసిన పక్కాగృహంతో మా కుటుంబానికి అద్దె ఇంటిలో నివసించే బాధ తప్పింది. మేము 15 ఏళ్లుగా అద్దె ఇంట్లో జీవిస్తున్నాము. వలంటీర్ల సర్వే ద్వారా అర్హులైన మాకు ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేసింది. ప్రభుత్వం అందించిన రూ.1.80 లక్షల సహాయానికి తోడు మేము కొంత డబ్బు సర్దుబాటు చేసుకుని పక్కాఇల్లు కట్టుకున్నాము. ఇప్పుడు మా కుటుంబానికి అద్దె ఇంటిలో నివసిస్తూ ఇబ్బందులు పడే బాధ తప్పిపోయింది.

– షేక్ మెహతాజ్, రాయచోటి

అవసరమైన సర్టిఫికెట్లు ఇచ్చారు



జగనన్న పరిపాలన ఎంతో బాగుంది. నవరత్నాల పేరుతో అనేక పథకాలను ప్రవేశపెట్టారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన అందుబాటులోకి వచ్చింది. ప్రజల అవసరాలు వలంటీర్ల ద్వారా సచివాలయం కార్యదర్శులు తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా మా కుటుంబానికి అవసరమైన పలురకాల సర్టిఫికెట్లను అధికారులు వార్డు సభల్లోనే అక్కడికక్కడే అందజేయడం ఎంతో ఉపయోగకరం.

– ఫక్రున్నీసా, సద్దాంవీధి, కొత్తపల్లె సచివాలయం, రాయచోటి